# ఒక రాస్కెల్ కథ

మంత్రిగారి దగ్గర నల్లధనం టన్నుల కొద్దీ మూలుగుతోందిట. హెడ్‌లైన్లలో అన్ని పేపర్లలో వచ్చిన వార్త ఇది!

అది వార్తే కాదు! వాస్తవం కూడా అదే! అప్పటికీ బినామీ పేర్లతో ఆస్తులు ఏర్పరిచాడు మంత్రి. కొంత ఆస్తిని స్విస్ బ్యాంకులో దాచాడు.

పైగా పిల్లికి బిచ్చం పెట్టడు. పరమలోభి! పిల్లా జల్లా లేరు. అంతా బామ్మర్దిగాడే చూసుకుంటూ వుంటాడు. మంత్రి గారికి ఊరికో పెళ్లాం ఉంది! ఏ ఒక్క పెళ్లానికీ కడుపు పండలేదు. పాపం! ఎన్నిసార్లు కొండకెళ్లి 'ఓసీ'గా గుండు కొట్టించుకున్నాడో? ఎన్నెన్నిసార్లు శ్రీశైలం వెళ్లి మల్లిఖార్జున స్వామికి అభిషేకం చేయించాడో? అన్నవరం సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఎన్నిసార్లు వ్రతాలు చేశాడో, అయినా తండ్రి అయ్యే యోగం లేకపోయింది.

అలాంటి వాడు కోటాను కోట్లు సంపాదించడం దేనికి? ఎవరి కోసం? కట్టుకుపోతాడా? అనే విమర్శలూ లేకపోలేదు! మంత్రి తనపై వారిని 'మేపుట'లో దిట్ట! పార్టీ ఫండ్ కింద బోలెడు డబ్బు ఉదారంగా దానం చేస్తూంటాడు.

ఆయనవద్ద బ్లాక్ మనీ మేరుపులా పెరిగిపోతుంది. ఏం చేయటానికి పాలుపోక బామ్మర్దిని సలహా అడిగేడు! 'ఏ ముంది బావా! పది భాషల్లో టాప్ స్టార్స్‌ని పెట్టి స్టార్ డైరక్టర్స్‌తో సినిమా తీస్తే కొంత ఖర్చవుతుంది' అని చెప్పాడు భగవంతం బామ్మర్ది.

'అందులోనూ లాభాలొస్తే?' అడిగాడు మంత్రి బావ.

"పట్టింది బంగారమయ్యే జాతకమే బావానీది! మీతిమీరిన ఆర్జన బ్రతుక్కే చేటు బావా! అంచేత. ఖర్మగాలి విపరీతమైన లాభాలొస్తే నోట్ల కట్టల్ని గోతాల్లోకుక్కి గోదాట్లో వదిలేద్దాం! అని కొట్టుకెళ్లి సముద్రంలో కలుస్తాయి. ఎలావుంది నా ఐడియా?" అన్నాడు బామ్మర్ది.

"సెబాస్ దేవుడూ!(బామ్మర్ది భగవంతాన్ని ముద్దుగా అలా పిలవడం అలవాటు) భలే సలహా ఇచ్చావ్. మరైతే ఇంకెందుకు 'డిలే!' వెంటనే కార్యాచరణలోకి దూకెయ్..."

"బావా! నాకు ఇంకో ఐడియా కూడా వచ్చింది. ఈ మధ్య ఓ పత్రికాధిపతి నడపలేక తనకున్న రెండు పేపర్లు మెషినరీతో సహా అమ్మకానికి పెట్టాడు. మనం కొనేద్దామా ఏమిటి?"

"ఎగ్రీడు!"

"వివరాలు చెప్పనీ! ఒకటి మాసపత్రిక. దానిపేరు వేదిక, మరొకటి దినపత్రిక! దాని పేరు రోదన! ఆఫ్ కోర్స్ రెండూ మంచి సర్క్యులేషన్ వున్నవే! కాకపోతే దాని ఓనరు ఈ బిజినెస్ మూసేసి మరోరకం వ్యాపారం చేయాలనే ఆలోచనల్లో వున్నాడు. అందుకే అమ్మేద్దామనుకున్నాడు!"

మంత్రి సంతోషంగా తలూపాడు.

"సెబాస్ బావా! పత్రికోళ్లంటే ఎవరైనా అదిరిచావాల్సిందే! అసలు అగ్గిలేకుండా చిచ్చుపెట్టేవి పత్రికలే కదా! రాజకీయ నాయకుడివి నీకు తెలియనిదా!" అన్నాడు మంత్రి.

"పన్నీరు బావా నా పనిలో నేనుండనా?"

మంత్రిగారి ఇంటిపేరు పన్నీరు! ఆయన ఉపన్యాసాలు వింటే ప్రజల మీద పన్నీరు చల్లినట్టే వుంటుంది. పూనకంతో ఊగిపోతుంటాడు మంత్రి.

"సూడు బామ్మర్దీ! మాసపత్రికను వీక్లీగా మారుద్దాం. దాన్నిండా సెక్స్ బొమ్మలు వాటి తాలూకు పాఠకులను ఉత్తేజపరిచే కథలుండాలి! ఈరోజుల్లో సినిమాల్లో చూపేదంతా బూతేగా! ఇట్టాంటి పత్రికలే యువతను రెచ్చగొట్టేవి! మగాళ్లకు తెలీకుండా ఆడాళ్లు చదువుతారు. ఒకప్పుడు రహస్యం! ఇపుడేమో అంతా బహిరంగమేనాయే! అందాల ఫోటోలు. ర్యాంప్ కేట్ వాక్‌లే! దేనికనుకున్నావ్? ఆడోళ్లు... అదే సుందరీమణులు తమ అందాలు వొంపు సొంపులు ఆరబోస్తూంటే చొంగకార్చుకు చేసే మగాళ్ల కోసమే కదా? పత్రికలూ అంతే! బూతు ఒకప్పుడు రహస్యం. ఇపుడు బహిరంగం! అంతే!"

"బావా! ఇంకో విషయం చెప్పటం మరిచాను. మనం ఒక టివి ఛానల్. కూడా పెడితే ఎట్టావుంటది?" అడిగాడు బామ్మర్ధి.

మంత్రి ఎగిరి గంతేశాడు. అంతా మన చేతిలో వున్న పనే! ప్రపంచం అంతా గుప్పెట్లో ఉన్నట్టే.

"నువ్ ఫికర్ చేయకు పన్నీరు బావా! నేను వక్కడ్ని అయితే మాత్రమేం? కొండలను పిండి చేయగల సత్తా నాకుంది. నువ్వు 'బేపర్వా'గా వుండు!" అన్నాడు బామ్మర్ది.

అతడి వంట పడింది. బావకు పెట్టుబడి పెట్టడం తప్ప మిగతా ఆలనా పాలనా ఎక్కడ చూడగలడు? అందుకే బామ్మర్దికి ఒక కొత్త ఆలోచన తోచింది.

తీయబోయే తెలుగు సినిమాలో హీరో వేషం తను వేస్తే పోలే! తనకేం తక్కువ? డిగ్రీ పాసైనాడు. ఎంబిఎ చేశాడు. ఉద్యోగం చేయటం ఇష్టం లేక బావను ఆశ్రయించాడు. పిల్లలు లేరనేసి తనను బావ అక్కున చేర్చుకున్నాడు.

హీరో విశేషాలు వేసేవారంతా అందగాళ్లా? కన్ను ముక్కు తీరు బావుంటే చాలు! ఆ క్వాలిఫికేషన్లు తనకున్నాయ్. కాలేజీల్లో నాటకాల్లో వేషాలు వేసిన అనుభవం వుండనే వుంది. మిగతా విషయాలు డైరెక్టర్ చూసుకుంటాడు.

తానే హీరోగా నటిస్తే.... అందుక్కావలసిన ఊకదంపుడు పబ్లిసిటీ తన (సారీ బావగారి) ఛానల్ ద్వారా ఇవ్వగల అవకాశం వుంటుంది. నిముషానికి వందసార్లు వూదరగొట్టొచ్చు!

తనకి నలభై దాటితేనేంగాక! ఫస్ట్ పిక్చర్ హిట్టయిందంటే నాసామిరంగా తను హీరోగా ఇండస్ట్రీలో సెటిలైపోవచ్చు! ఆఫర్లమీద ఆఫర్లొచ్చి కాళ్ల దగ్గరపడతాయ్. ఆ తర్వాత బిజీ హీరో అయిపోతాడు. క్షణం తీరిక వుండదు. ఊపిరి పీల్చుకునే టైమ్ కూడా వుండదు.

ఇంతలో సిఎం నుండి పిలుపు రావడంతో పన్నీరు బావ తన కార్లో తుర్రుమన్నాడు. తన అక్క ఒక పిచ్చిమాలక్ష్మి! చదువూ సంధ్యాలేదు. బుర్ర తక్కువ మనిషి. రోజుకు పదిరకాల పట్టు చీరెలు కట్టడం వంటి నిండా నగలు పెట్టుకుని నిలువుటద్దం ముందు కూర్చుని సోకు చూసుకు మురిసిపోవడం తప్ప మరో విషయం గురించి పట్టించుకోదు.

× × × × ×

మంత్రిగారు సినిమా ప్రొడ్యూసరైనాడన్న విషయం స్టేటంతా పాకింది. బావ గ్రీన్ సిగ్నల్ ఈయటంతో పిచ్చర్లో హీరో భగవంతమే! దర్శకుడిని ఫిక్స్ చేయటం, స్క్రిప్టు వర్కు పూర్తికావడం వంటి పన్లు పూర్తయినయ్.

సినిమా ప్రారంభోత్సవానికి, దినవార పత్రికల ప్రారంభానికి, టివి ఛానల్ ప్రారంభానికి ఒకే ముహూర్తం కుదరటం వల్ల టివి ఛానల్ రిబ్బన్ కటింగ్ పిఎం గారి చేత, పత్రికల ప్రారంభోత్సవం సీఎం గారి చేత, సినిమా ప్రారంభోత్సవం రాష్ట్రపతి గారిచేత కావటంతో పై కార్యక్రమాలకు ఎందరో ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఇతర పత్రికాధిపతులు, సినీ నిర్మాతలు, నటీనటులు ఎందరో ఆహ్వానితులూ విచ్చేయటం జరిగింది.

వేడుక చూడవచ్చిన వారంతా మంత్రిని అభినందించారు. పెద్దలు ఆశీర్వదించారు. మరికొందరు ఇంకా సంపాదించి కూడబెట్టి వెనకేసుకోమని, రాష్ట్రాని దోచుకోమని సలహా ఇచ్చి ప్రోత్సాహించారు.

ఏడాది తిరక్కముందే జనరల్ ఎలక్షన్స్ రానే వచ్చినయ్! గాడిదకేం తెలుసు పన్నీరు వాసన... అన్నట్లుగా ఓట్లు ఎలాంటి వ్యక్తులకేసి గెలిపించాలనే విజ్ఞత ఓటర్లకెక్కడుంది? ఈ పవిత్ర భారతంలో గుడ్డెద్దు చేలో పడ్డట్టు కళ్లు మూసుకు గుద్దేయటమే? ఎవరినో ఒకరిని గెలిపించటమనేది భారతీయుల ఆనవాయితీ. చదువు సంధ్యల్నువారూ సరైన రీతిలో అలోచించలేకపోవడం దేశ దౌర్భాగ్యం! కులాభిమానాలు, అవినీతి ప్రోత్సాహం, అబద్దాల వాగ్దానాలు! అయినా సరే అలాంటి వారికే జేజేలు కొడతారు! అప్పుడు తినేవాడికి తినిపించేవాడికి బేపర్వా!

ఎన్నికల్లో ఈసారి కూడా అఖండ మెజారిటీతో అన్ని సీట్లూ రామలింగయ్య పార్టీ స్వీప్ చేసింది. ఎందుకు చేయదూ? నల్లడబ్బు వెదజల్లాడు! మద్యం ఏరులైపారితే ఆ పార్టీ గెలవక చస్తుందా? పైగా నాయకుల్లో నీతిమంతులే కరువైరి. పార్టీ సిద్ధాంతాలను పతంగుల్లా గాలికొదిలేస్తారాయే! ఎవరు గెల్చిపదవిలోకొచ్చినా ఒరగబెట్టేదేంలేదని ప్రజలకు తెల్సునాయే? అందుకే ఓటర్లు తమ ఓటు హక్కును ఎన్నికలప్పుడు ఆ విధంగా దుర్వినియోగపరుస్తుంటారు. ఓటును అమ్ముకున్నా తప్పులేదని భావిస్తారు.

రామలింగయ్య మళ్లీ ఈసారి కూడా కేబినెట్ హోదా లభించినందుకు కొండకెళ్లి గుండు కొట్టించుకొచ్చాడు.

ఈసారి తాను ముఖ్యమంత్రి పదవి కోసం ఆరాటపడ్డాడు. కానీ కక్కుర్తిపడి కంగుతిన్నాడు. అధిష్టానానికి కోరినన్ని 'కోట్లు' ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తపరచకపోవడమే కారణమైంది. వందకోట్లిస్తే సిఎం చేస్తానన్నప్పటికీ

రామలింగయ్య సుముఖత వ్యక్తం చేయకుండా కేబినెట్ మంత్రి పదవికి పదికోట్ల ఇస్తే చాల్లెమ్మనుకుని దానితో సరిపెట్టుకున్నాడు.

కేంద్రం కన్నెర్ర చేయటం తన భవిష్యత్తుకు ఏనాటికైనా అవరోధం అవుతుందేమో ననేదూరాలోచనతో ఎన్నికలై తనకు మంత్రి పదవి దక్కేక మరో పది కోట్లు పార్టీ ఫండ్ కింద ఇచ్చి నమస్కారం చేశాడు. కాదు కాదు చైర్‌పర్సన్ కాళ్ల మీద సాష్టాంగపడ్డాడు.

ఎన్నికల్లో తన గెలుపునకు తన టివి ఛానల్ దినపత్రికలు దోహదపడినందుకు మురిసాడు రామలింగయ్య. ఈ విషయంలో అధిష్టానం కూడా సంతృప్తి వ్యక్తం చేయడం రామలింగయ్యకు ఆశీస్సైంది.

× × × × ×

రాష్ట్రంలో కరెంటు కొరత తీవ్రతరమవసాగింది. ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేయడం తప్పనిసరైంది. ఎన్నో వేల యూనిట్ల కరెంటు వృథా అవుతోందని తెల్సినా నిరోధించేటందుకు పటిష్టమైన చర్యలు పూజ్యం! వాగ్దానం చేసిన మేరకు ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంటు అందంచలేని దుస్థితి. రాష్ట్రంలో పవర్ కట్ కారణంగా పరిశ్రమలలో ఉత్పతి కుంటుపడింది.

వర్షాకాలంలో సైతం పవర్ ప్రొడక్షన్ మెరుగుపడనందుకు అటు ప్రజలు, ఇటు పత్రికలవాళ్లు, టీవీ ఛానళ్లు ప్రభుత్వాన్ని ఏకిపారేస్తున్నాయ్.

రామలింగయ్య ఇదే అదునుగా భావించి తాను సొంతగా పవర్ ప్లాంట్ నెల కొల్పాలనే ఆశతో రాజకీయ పరంగా పావులు కదిపాడు! రామలింగయ్య ప్రతిపాదనకు ఇటు రాష్ట్రం అటు కేంద్రం పచ్చ జెండా వూపింది.

అందుకు తగిన ఏర్పాట్లు చేయటానికి మంత్రి రామలింగయ్య శ్రమిస్తున్నాడు. బావమరిది వ్యతిరేకించాడు.

"నాకా పిల్లా జల్లా లేరు. నాకున్నదంతా నీకేచ్చేస్తాను. ఇకపోతే ఇలా పవర్ ప్లాంట్ స్థాపించటం మూలాన అటు దేశ ప్రయోజనాలు, ఇటు నిరుద్యోగులైన యువతకు ఉద్యోగాలు కల్పించినవాడినౌతాను....!"

"అంతేలే పన్నీరు బావా. చివరకు చింతామణి లాంటి వేశ్య కూడా పరమ భక్తురాలై ముక్తి పొందిందట. నీ విషయంలోనూ అదేవర్తిస్తుంది. తాగు! రెండు మూడు పెగ్గులు గొంతులో పోసుకుని ఇంత తిని హాయిగా నిద్రపో! పడే శ్రమ

మర్చిపోకాసేపైనా!"

"నామనసేమీ బాగోలేదురా దేవుడూ!"

"ఎందుకని పన్నీరు బావా?"

"ముఖ్యమంత్రిగారు చెప్పిన పని చెయ్యలేదని నామీద పీకలదాకా ద్వేషాన్ని పెంచుకున్నాడు! బహుశా నన్ను కేబినేట్లోంచి తీసేస్తాడేమో? ఢిల్లీ పోయి అధిష్టానం కాళ్లమీద పడదామంటే ఎవరిని ప్రసన్నం చేసుకోవాలన్నా కోట్లు కుమ్మరిస్తేగాని పనులు అయ్యేట్టు లేవు. దీనికితోడు స్విస్ బ్యాంకులో దాచుకున్న వాటి వివరాలను తెల్పమంటూ ప్రతిపక్షాలు కేంద్రంలో ఒకటే గొంతు చించుకుంటున్నయ్. అదీకాక కేంద్రం కూడా నా మీద గుర్రుగా వుంది!" మందు గొంతులో పోసుకున్నాడు రామలింగయ్య.

"మరైతే ఏం చేద్దామనుకుంటున్నావ్ పన్నీరు బావా!"

"నన్ను పార్టీ నుంచి, మంత్రి పదవి నుంచి గెంటేయకముందే నేనే తప్పుకొని కొత్త పార్టీ పెడితే ఎట్టావుంటుందని తీవ్రంగా ఆలోచిస్తున్నాను దేవుడూ!"

"నీ ఆలోచన బాగానే వుంది. కానీ, నీ వెంట వచ్చే వారెందరుంటారో అంచనా వేసుకున్నావా?"

"కోట్లు అధిష్టానానికి సిఎంకు ఇచ్చే బదులు... ఓ వందమంది ఎంఎల్ఎలను నావైపు మలుపుకోవటానికి ఖర్చు పెట్టాననుకో, ప్రభుత్వం మైనార్టీలో పడిపోద్ది! అపోజిషన్ పార్టీ వాళ్లను కలుపుకున్నాననుకో, నేనే పార్టీ అధ్యక్షుడిని. సిఎం ను అయిపోతాను. నా వాళ్లనుకున్న వారందరికీ మంత్రి పదవులు, కార్పొరేట్ పదవులు కట్టబెట్టి రాష్ట్రంలో చక్రం తిప్పొచ్చు! ఏమంటావ్...!" మనసు పొరల్లో దాగివున్న వాస్తవాలను బావమరిదితో వెళ్లగక్కేడు రామలింగయ్య.

"వద్దు బావా. ఇది నీకు తగదు. నీకా వయసు మీరుతోంది. శక్తి సన్నగిల్లుతోంది. ఇంకా పవర్‌పాలిటిక్స్ నీకు దేనికి చెప్పు? హాయిగా వున్నదాన్ని కాపాడుకుంటే చాలదూ?"

"రాజకీయాలంటేనే అంత! బ్రతకనీయవ్.... చావనీయవ్! ఉబ్బసం వ్యాధిలాంటిది! నలభైయేళ్లకు పైగా రాజకీయ రొంపిలో పొర్లాడుతున్నవాడిని! ఇప్పుడు చేతులు కట్టుక్కూర్చోవాలంటే మనసొప్పదు!" మూడోపెగ్గు గొంతులో పడగానే

మాట్లాడే ఓపిక లేక సోఫాలో జారగిలపడ్డాడు రామలింగయ్య.

× × × × ×

మంత్రి రామలింగయ్య ఆలోచన ఎరిగిన మిత్రులు ద్రోహచింతనతో ముఖ్యమంత్రికి, హస్తినలో అధిష్టానానికి దాన్ని కాస్తా చేరవేశారు రహస్యంగా.

ఇంకేముంది? భూమి కంపించినట్టు, సునామీ విరుచుకుపడ్డట్టయింది. ఇటువంటి సందర్భాలంటే అధిష్టానానికి పండగ! మూడవ కంటికి తెలీకుండా రామలింగయ్య ఇంటి మీదా, ఆస్తుల మీదా ఎసిబి దాడులు విరుచుకుపడినయ్!

చిలికి చిలికి గాలివాన అయినట్టు తన దురాలోచనే తనను గోతిలోకి నెట్టినట్టయింది. ఆస్తులు, బ్యాంకులాకర్లు, డాక్యుమెంట్స్ అన్నింటినీ ఎసిబి సీజ్ చేసింది. విదేశాలకు పారిపోతాడేమోననే శంకతో రామలింగయ్య పాస్‌పోర్టు, వీసాలు స్వాధీనపరచుకోవటం జరిగింది. రామలింగయ్యను కస్టడీలోకి తీసుకున్నారు. పేద కుటుంబంలో జన్మించిన రామలింగయ్యకు రాజకీయాల్లోకి అడుగుపెట్టి నేటి వరకు ఇరవై వేల కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తివున్నట్టు ఎసిబి లెక్కతేల్చింది.

పన్నీరు బావకు ఎక్కడ గుండెపోటు వస్తుందనో భయం భగవంతుడిని కలవరపెడుతోంది. ఉన్నదంతా పోయిందే అని కట్టుకున్న భార్య కన్నీరు మున్నీరుగా ఒకటే ఏడుపు! ప్రజల సొమ్ము ప్రభుత్వం సొమ్ము దిగమింగినందుకు తిక్క కుదిరిందంటూ శాపనార్థాలతో ప్రజలు దుయ్యబట్టారు.

బంగారు సింహాసనం మీద కూర్చుని, పసిడికంచంలో భోజనం చేసి, సువర్ణపు మంచం మీద పరుండిన రామలిగయ్యకు ఈవిధమైన శాస్తి జరగవలసిందేనని రాజకీయ నాయకులంతా తిట్టిపోశారు.

అత్యాశకుపోతే చివరికి జరిగే శాస్తి ఇలాగే ఉంటుంది. అందరినీ ఎల్లవేళలా కళ్ళు కప్పి అవినీతికి పాల్పడలేరు. ఏనాటికైనా దుర్మార్గం బైటపడకపోదు. పత్రికలు, టీవీ ఛానళ్లు దుమ్మెత్తిపోసినయ్.

ఏదిఏమైనా పన్నీరు రామలింగయ్య కేసు వెలికిరాగానే మిగతా అవినీతి పరులు జాగ్రత్త పడక తప్పదని నిర్ణయించుకోవడంతో కథ కొత్త మలుపు తిరిగింది.

(శ్రీలక్ష్మి - మంత్లీ జూన్ 2012)